ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన ఎమ్మెల్యే పోచారం

బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ పట్టణంలోని బీడీ వర్కర్స్ కాలనీ, బీర్కూర్ మండలం రైతునగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను తెలంగాణ ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మెన్ కాసుల బాలరాజు ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పోచారం మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి అయ్యేలా జూన్ నెల ఆఖరి వరకు లబ్ధిదారులకు అందేలా చూడాలని పనులు నెమ్మదిగా ఉన్న చోట లబ్ధిదారులతో సంప్రదించి సమస్యలు ఉంటే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించకుండా కట్టుదిట్టంగా పర్యవేక్షిస్తూ బిల్లుల

చెల్లింపుల విషయంలో ప్రతి దశలో బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు.ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం పూర్తి అయిన లబ్ధిదారులనే వెంటనే గృహప్రవేశం చేయించాలని తెలిపారు.ఏదైనా సమస్యలనే ఇళ్లు మంజూరు అయి ఇప్పటి వరకు నిర్మాణ పనులు ప్రారంభించకపోతే లబ్ధిదారులనే సంప్రదింపులు జరిపి త్వరిత గతిన నిర్మాణం పూర్తి చేసే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డిఓ రవీందర్ రెడ్డి, బాన్సువాడ పట్టణ, బీర్కూర్ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

నారాయణ సీబీఎస్ఈ కేశపూర్ బ్రాంచ్‌పై చర్యలు తీసుకోవాలి

డిచ్ పల్లి, బతుకమ్మ :డిచ్ పల్లి మండలం కేశపూర్ గ్రామ శివారులో నారాయణ సీబీఎస్ఈ బ్రాంచ్‌పై తక్షణ చర్యలు తీసుకోవాలని యు ఎస్ ఎఫ్ ఐ, టీజీవీపీ, ఏఐఎఫ్‌డీఎస్ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిర్మాణం పూర్తికాకముందే భవనంలో అక్రమంగా పాఠశాల నిర్వహిస్తూ భారీ ఫీజులతో అడ్మిషన్లు చేపడుతున్నారని ఆరోపిస్తూ సంఘాల ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. విద్యార్థి సంఘాల నాయకులు పెద్ది సూరి (యూఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి), బొబ్బిలి కళ్యాణ్ (టీజీవీపీ జిల్లా అధ్యక్షులు), మైత్రి రాజశేఖర్ (ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కార్యదర్శి) మాట్లాడుతూ, 2026--27 విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే అనుమతులు లేకుండా ఈ విద్యాసంస్థ కార్యకలాపాలు కొనసాగుతోందని ఆరోపించారు. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులను ప్రశ్నించగా అనుమతులు లేవని చెప్పినా, చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని విమర్శించారు. డిచ్ పల్లి ఎంఈఓ వ్యవహారశైలిపై కూడా వారు అనుమానాలు వ్యక్తం చేస్తూ, యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చే కార్పొరేట్ విద్యాసంస్థలపై కఠిన చర్యలు అవసరమని వారు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఈ ఫిర్యాదును జిల్లా విద్యాశాఖాధికారి పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు నాయకులు తెలిపారు. వెంటనే భవనాన్ని సీజ్ చేసి యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. లేకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి పి. మహేష్, నాయకులు మారుతి, జి. మహేష్, టీజీవీపీ

జిల్లా ఉపాధ్యక్షులు నిర్దు, ఏఐఎఫ్‌డీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మొరం తవ్వకాలపై చీతా ఫోర్స్ మెరుపు దాడి

ఒక జేసీబీ, ఐదు ట్రాక్టర్లు స్వాధీనం

నగర పోలీస్ కమీషనర్ సాయి చైతన్య

కమ్మర్ పల్లి, బతుకమ్మ :బషీరాబాద్ గ్రామ శివారులో గల కాడి చెరువు వద్ద అక్రమ మొరం తవ్వకాలపై చీతా ఫోర్స్ బృందం మెరుపు దాడి చేసింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదేశాల మేరకు, అక్రమ మైనింగ్, సహజ వనరుల అక్రమ రవాణాను అరికట్టేందుకు సీసీఎస్ ఏసీపీ ఇన్‌చార్జ్ మస్తాన్ అలీ పర్యవేక్షణలో చీతా ఫోర్స్ బృందం ప్రత్యేక నిఘా, తనిఖీలు నిర్వహిస్తోంది. ఈ తనిఖీలలో సోమవారము కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బషీరాబాద్ గ్రామ శివారులో గల కాడి చెరువు వద్ద అక్రమంగా మొరం తవ్వకాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు చీతా ఫోర్స్ సిబ్బంది ఆకస్మికంగా మెరుపు దాడి నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసు బృందం అక్కడ అక్రమంగా మొరం తవ్వి తరలిస్తున్న కార్యకలాపాలను గుర్తించింది. తనిఖీల సందర్భంగా మొరం తవ్వకాల కోసం వినియోగిస్తున్న ఒక జేసీబీ యంత్రం, మొరాన్ని రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను అధికారులు పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. అక్రమ తవ్వకాల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలిగించడమే కాకుండా పర్యావరణ సమతుల్యతకు భంగం కలిగించే చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా అధికారులు ముందుకు సాగుతున్నారు. చీతా ఫోర్స్ చేపట్టిన ఈ దాడి ద్వారా అక్రమ మైనింగ్ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడటంతో పాటు, ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారికి గట్టి హెచ్చరికగా నిలిచింది. స్వాధీనం చేసుకున్న జేసీబీ, ఐదు ట్రాక్టర్లను తదుపరి విచారణ, చట్టపరమైన చర్యల నిమిత్తం కమ్మర్‌పల్లి పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ కి అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసు

అధికారులు మాట్లాడుతూ, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ మొరం, ఇసుక, మట్టి తవ్వకాలు, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ప్రభుత్వ సహజ వనరులను అక్రమంగా దోచుకునే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు.

ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన సర్పంచ్

నాళేశ్వర్, బతుకమ్మ :నాళేశ్వర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లను సోమవారం సర్పంచ్ అర్గుల్ లావణ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా నాళేశ్వర్ గ్రామానికి 48 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు కావడం జరిగిందన్నారు. అవన్నీ చివరి దశలో పూర్తి కావడానికి వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అర్గుల్ శ్రీనివాస్, సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మండ్లు,వార్డు సభ్యులునవిన్, గణేష్,అనిల్,రాజు,కిషన్,కాంగ్రెస్ నాయకులు రాజన్న సంపత్,హన్మండ్లు, పోతన్న,నవిన్, సేక్రేటరి ఆఫీల్, కారోబార్ భుజంగ్ రావు ఉన్నారు.

ఘనంగా ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమం

ఏర్పట్ల, బతుకమ్మ : తాళ్ల రాంపూర్ గ్రామంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి పాల్గొన్నారు. నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో ఆయన పూజా కార్యక్రమాన్ని నిర్వహించి, గృహ ప్రవేశాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి తాళ్ల రాంపూర్ గ్రామ సర్పంచ్ బెజ్జారపు పావని భానుచందర్, కమ్మర్ పల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోరపల్లి లింగారెడ్డి, ఉప సర్పంచ్ చాట్ల జనార్దన్, నాగేంద్ర నగర్ సర్పంచ్ సందే రంజిత్, తొర్రి సర్పంచ్ కొడ భూమేష్, ధోం చంద ఉప సర్పంచ్ ఆసిరెడ్డి హనుమంత్, రెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీలు ఆదేం గంగ ప్రసాద్, ధోంచంద రవి రెడ్డి, ఏర్పట్ల మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రెండ్ల రమేష్, మండల కాంగ్రెస్ మైనార్టీ అధ్యక్షుడు ఎండి మునీర్, ఏర్పట్ల ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తాళ్ల రాంపూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, కర్లల లావణ్య, ఖర్గం ప్రమీలతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా గోపు గంగాధర్ బాధ్యతల స్వీకరణ

బాన్సువాడ, బతుకమ్మ : బాన్సువాడ మున్సిపల్ కమిషనర్‌గా గోపు గంగాధర్ సోమవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. గోపు గంగాధర్ గతంలో భీంగల్ మున్సిపాలిటీలో కమిషనర్‌గా విధులు నిర్వహించగా, బదిలీపై బాన్సువాడ పురపాలక సంఘ కార్యాలయానికి కమిషనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని పారిశుద్ధ్య నిర్వహణలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని, పట్టణ అభివృద్ధితో పాటు మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ముందుకు సాగుతానని ఆయన తెలిపారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన సాంఘిక సంక్షేమ గురుకులాలు

హైదరాబాద్, బతుకమ్మ:తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ ఆధ్వర్యంలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విద్యాసంస్థలు మరోసారి అత్యుత్తమ ఫలితాలతో రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచాయని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జేఇఇ అడ్వాన్స్ ఫలితాలు వెలువడిన అనంతరం మాట్లాడుతూ... జేఈఈ మెయిన్స్--2026, జేఈఈ అడ్వాన్స్ డ్--2026 పరీక్షల్లో గురుకుల విద్యార్థులు సాధించిన ఫలితాలు నాణ్యమైన ప్రభుత్వ విద్యకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచాయి. సొసైటీ పరిధిలోని 37 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ సంస్థల్లో సైన్స్, ఆర్ట్స్ విభాగాలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సీఓఈలలో విద్యసభ్యసిస్తున్న విద్యార్థులు జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు.

జేఈఈ మెయిన్స్ - 2026 పరీక్షకు మొత్తం 355 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 61 మంది విద్యార్థులు డైరెక్ట్ ఐఐటీ లో సీటు లో పొందారు. 102 మంది ప్రిపరేటరీ ర్యాంకులు సాధించి మొత్తం 163 మంది ఐఐటీల్లో ప్రవేశాలకు అర్హత సాధించారు. అదే విధంగా దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష అయిన జేఈఈ అడ్వాన్స్‌డ్ --2026లో విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. కమ్యూనిటీ ర్యాంకుల్లోనూ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. 500 లోపు ఒకరు, 1000 లోపు మూగురు, 2000 లోపు 14 మంది, 3000 లోపు 25 మంది, 5000 లోపు 39 మంది విద్యార్థులు కమ్యూనిటీ ర్యాంకులు సాధించి జాతీయ స్థాయిలో తమ సత్తాను నిరూపించారు. చిలుకూరు బాయ్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కు చెందిన పి.హేమంత్ ఎస్టీ కేటగిరీలో ఆల్ ఇండియా కమ్యూనిటీ ర్యాంక్ - 200 సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. గౌలిదొడ్డి బాయ్స్ సీఓఈకి చెందిన సత్య సూరావ్ (ఈడబ్ల్యూఎస్-741), వైభవ్ ప్రసాద్ (ఎస్టీ-984), తనీష్ (ఎస్టీ-1077), శిరీష్ (ఎస్టీ-1298), సాయిరాం (ఎస్టీ-1456), ప్రియాంక (ఎస్టీ-1509), వి.మంజుల (ఎస్టీ-1628), డి.దివ్య (ఎస్టీ-1696), ఎస్.సందీప్ (ఎస్టీ-1706), పరమాండ్ల మనస్విత్ (ఎస్టీ-1829), డి.శ్రీశాంత్ (ఎస్టీ-1881), కె.శ్రీవర్ష (ఎస్టీ-1907), డి.ఆక్షయ్ (ఎస్టీ-2054), ఎస్.పూజ (ఎస్టీ-2197), కె.ఉదయ్ (ఎస్టీ-2313), జయసింధూర (ఎస్టీ-2423), ఏ.అభినవ్ (ఎస్టీ-2431), జె.నవీన్ (ఎస్టీ-2521) తదితరులు ర్యాంకులు సాధించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ కార్యదర్శి విజయేంద్ర బోయి మాట్లాడుతూ... గురుకుల విద్యాసంస్థలపై తల్లిదండ్రులు ఉంచుతున్న విశ్వాసానికి ఈ ఫలితాలు నిదర్శనమన్నారు. విద్యార్థుల సామర్థ్యాలను గుర్తించి లక్ష్యబద్ధమైన శిక్షణ, నిరంతర పరీక్షలు, వ్యక్తిగత అకాడమిక్ మెంటరింగ్, ప్రత్యేక ఐఐటీ-జేఈఈ కోచింగ్, అనుభవజ్ఞులైన అధ్యాపకుల పర్యవేక్షణ వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని విద్య ద్వారా సాకారం చేసే దిశగా కృషి చేస్తోందన్నారు. “పేదరికం ప్రతిభకు అడ్డంకి కాదని గురుకుల విద్యార్థులు మరోసారి నిరూపించారు. గ్రామీణ ప్రాంతాలు, దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులు దేశంలోని అత్యున్నత విద్యాసంస్థల్లో ప్రవేశాలు సాధించడం తెలంగాణకు గర్వకారణం.

గురుకుల విద్యార్థులు ఐఐటీలు, ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీలు, ఎయిమ్స్ వంటి జాతీయ సంస్థల్లో రాణించేలా ప్రభుత్వం అన్ని విధాలా తోడ్పాటు అందిస్తోంది” అని మంత్రి పేర్కొన్నారు. గత రెండేళ్లుగా గురుకుల విద్యాసంస్థల్లో అకాడమిక్ ప్రమాణాల పెంపు, ఆధునిక బోధనా విధానాలు, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ, విద్యార్థుల మానసిక దృఢత్వం పెంపునకు చేపట్టిన కార్యక్రమాలు ఫలితాల రూపంలో ప్రతిఫలిస్తున్నాయని ఆయన తెలిపారు.